
సాక్షి చిత్తూరు

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



మున్సిపల్ శాఖలో ఆన్‌లైన్ బదిలీలు

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఆన్‌లైన్ బదిలీల విధానాన్ని అమలు చేస్తామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. - 8లో



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. కంపార్ట్‌మెంట్లు నిండాయి. దర్శనం టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.



త్రుటిలో తప్పిన ప్రమాదం

చిత్తూరు నగరంలోని శంకరయ్యగుంట ప్రాంతంలో విద్యుత్ లైన్ తగిలి మేస్త్రీ చేతులు కాలిపోయిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

జేసీ బాధ్యతల స్వీకరణ రేపు

చిత్తూరు కలెక్టరేట్: నూతన జాయింట్ కలెక్టర్ విద్యాధరి బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమె మంగళవారం జిల్లాకు రానున్నారు. జేసీ బాధ్యతలు స్వీకరణకు కలెక్టరేట్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

చిత్తూరు అర్బన్: చిత్తూరులో రౌడీషీటర్లు పద్ధతి మార్చుకుని మర్యాదగా నడచుకోవాలని, లేనిపక్షంలో ఇబ్బంది తప్పదని డీఎస్పీ సాయినాథ్ హెచ్చరించారు. సోమవారం చిత్తూరు-2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నెట్టికంటయ్యతో కలిసి రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. తెలిసీ తెలియక చేసిన నేరాల విషయంలో పశ్చాత్తాపంతో ఉండాలని.. సామాన్యులను ఇబ్బంది పెట్టేలా నడుచుకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలో పాల్గొన్నా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో నమోదైన రౌడీషీటర్లపై పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందని, చెడు చేయాలనే ఆలోచనలతో జీవితాన్ని నాశనం చేసుకోరాదని హితవు పలికారు.

అపోలో హాస్టల్ విద్యార్థుల అస్వస్థతపై విచారణ

కాణిపాకం: చిత్తూరు నగరంలోని అపోలో మెడికల్ కాలేజీలో సుమారు 300 మంది విద్యార్థులు కలుషితాహారం తిని అస్వస్థతకు గురయ్యారు. ఈనెల 21న కలుషిత ఆహారంతో విద్యార్థులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రుల బాట పట్టడం, జిల్లా వైద్య విధాన పరిషత్, వైద్యఆరోగ్య శాఖ అధికారులు స్పందించి అపోలో మెడికల్ కాలేజీలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం విదితమే. మూడు రోజుల పాటు బాధితులు 300 మంది, 400 మంది, 710 మంది అంటూ విద్యార్థులు లెక్కలు చెబుతూ వచ్చారు. అయితే అధికారులు మాత్రం బాధితులు 244 మందిగా తేల్చారు. ఇందులో 118 కేసులు జిల్లా ఆస్పత్రిలో అడ్మిట్ చేయగా, తమిళనాడులోని రాణిపేట సీఎంసీకి ఇద్దరు, మరో ఇద్దరిని చీలాపల్లె సీఎంసీకి రెఫర్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు తల్లిదండ్రులు కొందరిని తీసుకెళ్లగా, మరికొంతమంది విద్యార్థులు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందారు. బాధితులందరికీ ఆస్పత్రిలో నాలుగు రోజుల చికిత్సతో కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఇక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఆహారభద్రత అధికారులు... ఆహార పదార్థాలు, తాగునీరు శాంపిల్స్ సేకరించారు. అలాగే ఆర్‌ఆర్‌టీ అధికారులు విద్యార్థుల వాంతులు, విరేచనాలు, తాగునీటి నమూనాలను తీసి తిరుపతిలోని ల్యాబ్‌కు పరీక్ష నిమిత్తం తీసుకెళ్లారు. ఇందులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 10 వాటర్ శాంపిల్స్, ఆర్‌డబ్ల్యూఎస్ 5 నమూనాలు సేకరించాయి. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ సేకరించిన నీటి నమూనాలో బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారించారు. ఇక, ఇతర శాంపిల్స్ ఫలితాలు మంగళవారం రానున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. దీనిపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల వాంతులు, విరేచనాలకు కారణాలను తేల్చాలని పేర్కొనడంతో రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు.

28 నుంచి ఐసీడీఎస్ పోస్టులకు ఇంటర్వ్యూలు

-ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగశైలజ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా మహిళా-శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఈ నెల 28,29,30వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ పీడీ నాగశైలజ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఐసీడీఎస్ పరిధిలో జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్, బ్లాక్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్స్, ప్రొటెక్షన్ ఆఫీసర్స్, కౌన్సిలర్, సోషల్ వర్కర్, అకౌంటెంట్, డేటా అనలిస్ట్ పలు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 23న పలు కేడర్ల పోస్టులకు కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించామన్నారు. ఆ పరీక్షలో ఎంపికైన, నేరుగా భర్తీ చేసే పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 28, 29, 30వ తేదీల్లో కలెక్టరేట్ నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా విద్యార్హత సర్టిఫికెట్లు, ఇతర ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని తెలిపారు. పోషణ్ అభియాన్ స్కీంలో భర్తీ చేస్తున్న జిల్లా ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్, జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్, బ్లాక్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పోస్టులకు ఈ నెల 28న, మిషన్ వాత్సల్య స్కీంలో భర్తీ చేస్తున్న ప్రొటెక్షన్ ఆఫీసర్స్, కౌన్సిలర్, సోషల్ వర్కర్, అకౌంటెంట్, డేటా అనలిస్ట్, ఔట్‌రీచ్ వర్కర్, ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు 29న తేదీన ఉదయం 9 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. అలాగే మిషన్ శక్తి స్కీంలో ఐటీ, ఆఫీస్ అసిస్టెంట్, సెంటర్ అడ్మినిస్ట్రేటర్, పారా లీగల్ పర్సనల్, పారా మెడికల్ పర్సనల్, సోషల్ కౌన్సిలర్, మల్టీపర్పస్ అసిస్టెంట్, నైట్ వాచ్‌మన్ పోస్టులకు 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పీడీ వెల్లడించారు.

కఠిన శిక్షలు విధించాలి



ఉద్యోగినులపై తరచూ జరుగుతున్న లైంగికదాడుల ఘటనలపై జాతీయ స్థాయిలో పటిష్టమైన చట్టాన్ని తీసుకురావాలి. ప్రస్తుతం కర్ణాటకలో అమలు చేస్తున్న విధానాన్ని ఇక్కడా అమలు చేయాలి. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న వైద్యులపై జరిగే దాడులను తీవ్రంగా పరిగణించాలి. కోల్‌కతా వంటి ఘటనలు జరిగినప్పుడు నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు విధించాలి. ఆస్పత్రులు, పీహెచ్‌సీలకు భద్రత ఉండాలి.

-జ్ఞానదీప, ఏఎన్ఎం, చిత్తూరు




న్యాయం చేయాలి



కోల్‌కతా ఘటన నేపథ్యంలో పోరాటం మరింత ఉధృతం చేస్తాం. ఎక్కడో జరిగింది కదా అని, ఇంకెక్కడా జరగదనే భావన తగదు. పీజీ వైద్య విద్యార్థిని కేసు విచారణ రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ దారుణం మరో ఆడపిల్లకు జరగకూడదు. దోషులను తప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలున్నాయి. మా పోరాటానికి అన్ని వర్గాలు, సంఘాల నుంచి విశేషమైన మద్దతు లభించింది.

-రెడ్డితేజ, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు



ఈసారి ఐటీఐ స్థలం..!

కూటమి అధికారంలోకి రాగానే టీడీపీ నేతలు ఆక్రమణల బకాసురుల అవతారం ఎత్తారు. ఎక్కడైనా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు..దాన్ని దర్జాగా కబ్జా చేసి అవురావురుమని ఆరగిస్తున్నారు. అది ప్రైవేటైనా.. ప్రభుత్వ భూమైనా డోన్ట్‌కేర్ అనే లెవెల్లో అప్పనంగా హాంఫట్ చేసేస్తున్నారు! ఇప్పటికే రూ.40కోట్లకు పైగా విలువైన మత్స్యశాఖ కార్యాలయ స్థలాన్ని టీడీపీ కార్యాలయం ఏర్పాటు పేరిట రోస్ట్ చేశారు. ఆ 'చేప రోస్ట్' ఆకలి తీరకముందే తాజాగా ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)కు చెందిన రూ.20కోట్ల పైచిలుకు విలువైన భూములనూ మింగడానికి అనకొండలయ్యారు.



చిత్తూరు అర్బన్: చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిను ఆనుకుని ఐటీఐకు దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇందులో విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో పాటు, పారిశ్రామిక విధానంపై శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇదే స్థలాల్లో వ్యవసాయశాఖ ప్రయోగశాల భవన నిర్మాణం జరుగుతోంది. అలాగే జిల్లా ఉపాధి కార్యాలయం కూడా ఇదే ప్రాంగణంలో ఉంది. ఇటీవల ఇక్కడ అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సమయంలో స్థానికంగా ఉన్న టీడీపీ నేతల కన్ను అన్న క్యాంటీన్ వెనుక ఉన్న స్థలంపై పడింది. ఐటీఐకి చెందిన దాదాపు మూడెకరాల స్థలం ముళ్లకంపలు, పిచ్చి మొక్కలతో ఉంటోంది. దీన్ని చదును చేసి, ప్లాట్లు వేసి, విక్రయిస్తే తేరగా రూ.కోట్లు సంపాదించవచ్చని టీడీపీ నేతలు స్కెచ్ వేశారు. బరిలో దిగారు. ఐటీఐ స్థలంలో ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు మూడు రోజులుగా తొలగిస్తూ భూమిని చదును చేస్తున్నారు. దాదాపు 50 వరకు ప్లాట్లను వేసి అమ్ముకోవాలనే దిశగా అధికార పార్టీ నేతలు జేసీబీలతో చక చకా పనులు ప్రారంభించారు.

ముగ్గురికి మూడు ఎకరాలు!

ఈ స్థలంపై తొలుత ఓ టీడీపీ మాజీ కార్పొరేటర్ భర్త కన్ను పడింది. ఎవరూ పెద్దగా పట్టించుకోని ఆ మూడు ఎకరాల స్థలంలో 50కు పైగా ప్లాట్లు వేయవచ్చని అంచనా వేశాడు. వెంటనే రంగంలోకి ఇదగి జేసీబీలతో చదును చేసే పనులు ముమ్మరం చేశాడు. దీనిని గుర్తించిన మరో టీడీపీ నాయకుడు, స్థానికంగా కాపురముంటున్న ఓ ప్రజాప్రతినిధి అనుచరుడు కలిసి జేసీబీతో చేస్తున్న పనులపై ఆరా తీశారు. స్థలం ఆక్రమణ జరుగుతోందని తెలుసుకున్నారు. దీనిని అడ్డుకోవాల్సింది పోయి..తస్సదియ్యా.. ఇంతకు మించిన అవకాశం రాదనే లెవెల్లో ఆ ఇద్దరూ రాయ'బేరం' పెట్టారు. తమకూ వాటా కావాలని గట్టిగా పట్టుబట్టారు. దీంతో ఆక్రమణలకు స్కెచ్ వేసిన టీడీపీ మాజీ కార్పొరేటర్ విషయం బయటకు పొక్కితే మరికొందరు కూడా రంగప్రవేశం చేయవచ్చని భావించాడు. చివరకు మూడెకరాలను సమానంగా పంచుకోవాలని తీర్మానానికి వచ్చారు. విషయం ఎక్కడా బయటకు పొక్కకూడదని ఒకరికొకరు ప్రమాణం చేసుకున్నారు. తీరా జేసీబీతో చేస్తున్న పనులు అక్కడే ఉన్న సంజయ్‌గాంధీ నగర్ కాలనీ వాసులు చూసి అనుమానించారు. ఐటీఐ అధికారులకు సమాచారం చేరవేశారు. దీంతో ఐటీఐ ప్రిన్సిపల్ ఉరుకులు పరుగులతో అక్కడికి చేరుకున్నారు. టీడీపీ నేతల భూకబ్జాను చూసి నిశ్చేష్టులయ్యారు. వెంటనే జేసీబీలతో సహా బయటకు పోవాలని, లేనిపక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీనికి ఏమాత్రం తగ్గని టీడీపీ నేతలు 'ఇక్కడ ఇళ్లు కట్టుకోమని కలెక్టర్ మాకు పట్టాలు ఇచ్చారు. ఇపుడు మీరు ఆపినా, ఇక్కడ ఇళ్లు కట్టే తీరుతాం. ఎవరు అడ్డొస్తారో చూస్తాం..' అని హెచ్చరించారు. వివాదం ముదురుతోందని గ్రహించి ప్రస్తుతానికి అక్కడి నుంచి వెళ్లిపోయినా.. మళ్లీ ఎపుడైనా వచ్చి స్థలం కబ్జా చేస్తారోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

ప్లాట్లు వేసేందుకు రాళ్లు సైతం..

స్థలం చదును చేశాక ప్లాట్లు వేయడానికి, ఒక్కో ప్లాట్ల ఏర్పాటు నిమిత్తం రాళ్లను సైతం ఐటీఐ చదును చేసిన ప్రాంతానికి తీసుకువచ్చారు. చదును పనులయ్యాక రాళ్లు నాటాలనే వారి యత్నం స్థానికుల మూలాన బెడిసి కొట్టిందనే చెప్పాలి. స్థానికులు గమనించి ప్రిన్సిపల్‌కు సమాచారం చేరవేయడంతో ఆయన నిలదీయడంతో వెనుదిరిగారు. తెచ్చిన రాళ్లను సైతం అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు.

కబ్జాను అడ్డుకున్నా..

అన్న క్యాంటీన్ వెనుక వైపు ఉన్న స్థలం ప్రభుత్వ ఐటీఐకు సంబంధించినదే. ఇటీవల ఈ స్థలంలో కొందరు జేసీబీలను తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారని సమాచారం అందడంతో వెళ్లి చూశా. జేసీబీతో ఐటీఐ స్థలాన్ని చదును చేస్తున్నారు. ఏమిటని వారిని ప్రశ్నించా. ఇది తమకు చెందిన భూమి అని, దీనికి పట్టా ఉందని అబద్ధాలు చెబుతున్నారు. ఇక్కడి నుంచి వెళ్లకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని గట్టిగా వార్నింగ్ ఇవ్వడంతో వెళ్లిపోయారు. జరిగిన విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. మళ్లీ ఇలాంటి పనులు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

– రవీంద్రరెడ్డి, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ, చిత్తూరు



చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ స్థలాన్ని చదును చేసిన టీడీపీ నేతలు



చిత్తూరు ఐటీఐ స్థలంలో ప్లాట్లు వేసిన టీడీపీ నాయకులు

జల్లికనికట్టు

జేబులో రూపాయి లేకున్నా కేవలం 10–15 రోజుల్లోనే లక్షలు సంపాదించాలనుకుంటున్నారా? విద్యాపరంగా క్వాలిఫికేషన్‌తో పనిలేదు. రాజకీయాల్లో ఉండటం.. ఆపై అందరినీ మేనేజ్ చేయడమే అసలైన క్వాలిఫికేషన్.. అంతే..ఇక దబ్బే..డబ్బు..! ఇలా కుప్పం నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు అట్టే కష్టం లేకుండా 'జల్లికట్టు'తో స్వయం ఉపాధి బాట పట్టారు.! జల్లికట్టుపై నిషేధం ఉన్నా అధికారం అండతో నిబంధనలకు పాతర వేసి కనికట్టు చేస్తున్నారు.

- నిబంధనలకు పాతర
- కుప్పంలో కాసులు కురిపిస్తున్న పశువుల పందేలు
- ఒకసారి జల్లికట్టు నిర్వహిస్తే లక్షల్లో ఆదాయం
- పచ్చ నేతలు, అధికారులతో కుమ్మక్కై నిర్వహణ

కుప్పం: తమిళనాడు రాష్ట్రం జల్లికట్టు పోటీలకు పేరొందింది. సుప్రీంకోర్టు దీనిని కట్టడి చేయాలని ఆదేశించినా అక్కడ సంప్రదాయం పేరిట వారి నరాల్లో జల్లికట్టు జీర్ణించుకుపోయింది. జల్లికట్టు కోసం ఉద్యమాలు చేసిన చరిత్ర కూడా వారిది. కుప్పం తమిళనాడుకు సరిహద్దులోనే ఉండడంతో నిషేధం ఉన్నా ఇక్క జల్లికట్టుకు క్రేజ్ ఉంది. ఇక్కడ జల్లికట్టు అధికార పార్టీ నాయకులకు జేబులు నింపుతోంది. తమిళనాడులో సంప్రదాయక పోటీలు అయితే, ఇక్కడ ఫక్తు జేబులు నింపుకోవడమే లక్ష్యంగా నిబంధనలకు పాతర వేసి నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు సంక్రాంతి పండుగ సందర్భంగా సరదాగా ఈ ప్రాంతాల్లో నిర్వహించే జల్లికట్టును ఇప్పుడు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అధికార పార్టీ నేతలు అధికారులను మేనేజ్ చేస్తూ, అట్టే ఖర్చు లేకుండా లక్షలాది రూపాయలు జేబులు నింపుకుంటున్నారు.

ఎద్దుల పండుగ పేరిట హంగామా

ఎద్దుల పండుగ పేరిట జల్లికట్టు నిర్వహణకు పూనుకుంటున్నారు. 2-3 ఎకరాల్లో విశాలమైన స్థలాన్ని తొలుత ఎంపిక చేస్తారు. ఎద్దులు పరుగులు తీసేందుకు అనువుగా మూడు అడుగుల వెడల్పుతో 500 మీటర్ల పొడవునా కర్రలతో బాజీ (దీనిని రన్నింగ్ రేస్ ట్రాక్‌గా చెప్పుకోవచ్చు) ఏర్పాటు చేస్తారు. ఎద్దుల యజమానుల నుంచి నిర్ణీత ప్రవేశ రుసుం కట్టించుకుంటారు. ఆ తర్వాత సీరియల్ నంబర్ ప్రకారం ఒక్కో ఎద్దును బాజీలో వదులుతారు. ఒక్కో ఎద్దు 500 మీటర్ల దూరం ఎంత సమయంలో దాటిందో టైమింగ్ నమోదు చేస్తారు. అంతిమంగా ఏది తక్కువ సమయంలో దాటిందో రికార్డు చేసిన టైమింగ్ ఆధారంగా దానిని విజేతగా ప్రకటిస్తారు.



కుప్పం ప్రాంతంలో నిర్వహించిన జల్లికట్టు (ఫైల్)

లారీలు, లగేజీ ఆటోలలో పోటీ ఎద్దులు

ఈ పందేలకు ఎక్కువగా తమిళనాడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ఎద్దులను లారీలు, మినీ టెంపోలు, లగేజీ ఆటోలలో ఇక్కడికి తీసుకువస్తారు. జల్లికట్టు నిర్వహించే ప్రాంతం అంతా ఒక తిరునాళ్లను తలపించేలా తాత్కాలిక చిల్లర దుకాణాలు ఏర్పాటవుతాయి. ఎద్దుల పోటీలకు వచ్చేవారికి అన్ని సదుపాయాలు నిర్వాహకులు కల్పిస్తారు.

పెట్టుబడి వెయ్యి ..లక్షల్లో ఆదాయం

విశాలమైన ప్రాంతంలో జల్లికట్టు నిర్వహిస్తున్నామని, పది రకాల నగదు బహుమతులు ఇవ్వనున్నట్టు తొలుత కరపత్రాలు ముద్రించి, ప్రధానంగా కుప్పం సరిహద్దులోని తమిళనాడు ప్రాంతాల్లో ప్రచారం చేస్తారు. దీంతో పాటు సోషల్ మీడియాలోనూ హల్‌చల్ చేస్తారు. ఇటీవలే నిర్వహించిన జల్లికట్టులో పాల్గొనేందుకు ప్రతి పశువుకూ రూ. 2 వేల నుంచి రూ.3 వేల వరకు ప్రవేశ రుసుం నిర్ణయించారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు, సేలం, ధర్మపురి, క్రిష్ణగిరి, వేలూరు, తిరుపత్తూరు జిల్లా నుంచి వందల సంఖ్యలో పశువులు వస్తాయి. వెయ్యి పశువులు జల్లికట్టులో పాల్గొంటే రూ.30 లక్షలు ప్రవేశ రుసుం రూపేణా నిర్వాహకులకు చేరుతుంది.

వినోదం..విషాదం

జల్లికట్టులో జనం అరుపులు, కేకల నడుమ ఎద్దులను పరుగులు తీయించడంతో అవి బెదిరి జనం వైపు దూసుకొస్తాయి. దీంతో అప్పటివరకు కేరింతలు కొడుతున్న జనం వాటి బారి నుంచి తప్పించుకునేందుకు ప్రాణభయంతో పరుగులు తీయడం జరుగుతోంది. అవి జనం మీదకు దూసుకుపోయి కుమ్మడం వల్ల గాయపడటమే కాకుండా ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ఇటీవలే కుప్పం వద్ద నిర్వహించిన జల్లికట్టులో 10 మందికి పైగా తీవ్రగాయాలయ్యాయి. కళ్లెదుటే ఇంత జరిగినా పోలీస్ శాఖ తీరు మాత్రం మరోలా ఉంటోంది. తమ సర్కిల్ పరిధిలో జల్లికట్టే లేదని ఓ పోలీసు అధికారి చెప్పడం గమనార్హం!

జల్లికట్టు నిర్వహణకు అయ్యే ఖర్చు

కుప్పం ప్రాంతంలో టీడీపీ నేతలు జల్లికట్టు నిర్వహణకు వేలల్లో ఖర్చు పెట్టి, లక్షల్లో ఆదాయం కళ్లజూస్తున్నారు. పశువులకు రన్నింగ్ ట్రాక్ (బాజీ) ఏర్పాటుకు తమిళనాడు చెందిన కాంట్రాక్టర్‌తో లక్ష రూపాయలకు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. బాజీతో పాటు అనౌన్స్‌మెంట్ కోసం మైకులు, రీడింగ్ మీటర్లు కాంట్రాక్టర్లకే ఇస్తారు.

బహుమతుల పేరిట..

నిర్వాహకులు మొదటి బహుమతి నుంచి 10వ బహుమతి వరకు మొత్తం కలిపి రూ.5లక్షల వరకు ఇస్తారు. నిషేధం మూలాన కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు సంబంధిత శాఖకు రూ.లక్ష వరకూ ముడుపులు ఇస్తున్నట్లు తెలిసింది. దీంతోపాటు చిన్నపాటి ఖర్చులు రూ.2 లక్షల వరకు వ్యయం చేస్తారు. ఈ లెక్కన ప్రవేశ రుసుం పేరిట వచ్చిన రూ.30 లక్షల్లో ఖర్చు 9 లక్షలు మాత్రమే. మిగిలిన రూ. 21 లక్షలు టీడీపీ నేతలు జేబుల్లోకి చేరుతుంది. ఈ మధ్య వరుసగా టీడీపీ నేతలు జల్లికట్టు నిర్వహిస్తూ ఆదాయం దండుకుంటున్నారు!

క్రీడలపై మక్కువ పెంచుకోవాలి



ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్‌డీఓ బాలాజి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై మక్కువ పెంచుకోవాలని డీఎస్‌డీఓ బాలాజి కోరారు. క్రీడా దినోత్సవం పురస్కరించుకుని సోమవారం నగరంలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్, ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ, బీసీ వసతి గృహాల్లో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. డీఎస్‌డీఓ మాట్లాడుతూ, ప్రతి ఏటా ఆగస్టు 29న హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా సోమవారం నుంచి 30వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం విద్యార్థులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, నిర్యాణం సమాచారం వర్ధంతి, జయంతిల నివాళులు ప్రకటనల కోసం సంప్రదించండి.



మీ ఉన్నతికై శ్రమించిన ఆత్మీయుల జ్ఞాపకాలు, నివాళులు బంధుమిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు సమాచారం తెలియజేసే అవకాశం.

సాక్షి దినపత్రికలో అంతిమయాత్ర, శ్రద్ధాంజలి, వర్ధంతి, జ్ఞాపకార్థకూడిక తదితర ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో వున్నారు.

డిస్కౌంట్

SAKSHI

99122 20586, 97054 44179

Mail id: tptadvtsakshi@gmail.com

క్లుప్తంగా

ఈ మృతుడు ఎవరో..?


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

పుత్తూరు: పట్టణంలోని శ్రీనివాస ఆసుపత్రి వెనక ఉన్న లేఔట్‌లో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న గుర్తు తెలియని వ్యక్తిని స్థానిక పోలీసులు ఈనెల 21న గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై తెల్ల పంచె, చొక్కా ధరించి ఉన్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్‌ఐ వెంకటమోహన్ తెలిపారు. ఎవరికైనా అతడి గురించి తెలిస్తే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని శంకరయ్య గుంట ప్రాంతంలో విద్యుత్ లైన్ తగిలి మేస్త్రీ చేతులు కాలిపోయిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, నివాసముంటున్న ఇక్బాల్ ఇంటి మొదటి అంతస్తులో టైల్స్ వేసే పనులు చేస్తున్నారు. అక్కడ అడ్డంగా ఉన్న ఇనుప పైప్‌ను మేస్త్రీ రమేష్‌ను కిందకు దించమని యజమాని చెప్పాడు. దీంతో పైప్‌ను దించే క్రమంలో 33 కేవీ లైన్ తగిలి రమేష్ చేతులు కాలాయి. ఆయన్ను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. దీంతో ఆ ప్రాంతంలో లైన్ ట్రిప్ అయింది. ఏఈ బాలచంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మున్సిపల్ శాఖలో ఆన్‌లైన్ బదిలీలు

- రాష్ట్రవ్యాప్తంగా టీడీఆర్ బాండ్లపై లోతైన విచారణ
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ

తిరుపతి తుడా: రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఆన్‌లైన్ బదిలీల విధానాన్ని అమలు చేస్తామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఆయన సోమవారం మున్సిపల్ కార్పొరేషన్, తుడా అధికారులతో తుడా కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆ సంస్థల ఆర్థిక అంశాలు, అభివృద్ధి పురోగతి, విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో దొంగ ఓట్ల నమోదుపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం దర్యాప్తు చేస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో విడుదల చేసిన టీడీఆర్ బాండ్లపైన సీఐడీ లోతైన విచారణ జరుపుతున్నదని వివరించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు డ్రైనేజీ వాటర్ శుద్ధి కోసం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను అన్ని మున్సిపాలిటీల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.350 కోట్లను కేటాయించిందని తెలిపారు. మున్సిపాలిటీల్లో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా కమిషనర్లు వేగంగా ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించినట్లు మంత్రి చెప్పారు.

రాత్రి వేళ పోలీసు భద్రత కల్పించాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణ పరంగా పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా రాత్రి వేళ ప్రతి ఆస్పత్రి వద్ద పోలీసు గస్తీ ఉండేలా చూడాలి. దీనికితోడు అవసరమైనన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల్లో 50 నుంచి 60 శాతం మంది మహిళలే పని చేస్తున్నారు. కోల్‌కతా ఘటన నేపథ్యంలో నైట్ డ్యూటీ సమయంలో రక్షణ, భద్రత విషయంగా ఒకింత ఆందోళన ఉంటోంది.

–చరిష్మా, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు



పోలీసులు, కోర్టులు వేగంగా స్పందించాలి




కోల్‌కతా ఉదంతం నేపథ్యంలో రాత్రి పూట డ్యూటీలంటేనే ఆందోళన చెందవలసివస్తోంది. సీహెచ్‌సీలో అన్ని సదుపాయాలున్నాయి. సీసీ కెమెరాలు, ప్రైవేటు సెక్యూరిటీ కూడా ఉంది. ఆస్పత్రి ఆధునీకరణతో డాక్టర్లు, సిబ్బంది సంఖ్య పెరగడంతో ఓపీ కూడా పెరిగింది. జనరేటర్ ఉండటంతో విద్యుత్ కోతలున్నా ఎలాంటి ఇబ్బందీ లేదు. మహిళలు, డాక్టర్లపై దాడులు చేస్తే వారిని కఠినంగా శిక్షించాలి. ఇలాంటి కేసుల్లో పోలీసులు, కోర్టులు వేగంగా స్పందించాలి.

–అభి, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

రాజు గారి కథ

కథలు రాయడమంటే చిన్న విషయం కాదు.. ఆలోచనలకు పదును పెట్టాలి.. సమాజంలోని స్థితిగతులను ఆకళింపు చేసుకోవాలి..యాసతో ఆకట్టుకోవాలి.. సామాజిక స్పృహను ప్రతిబింబించాలి.. అనుభవాలను రంగరించాలి.. పాఠకులను అలరించాలి.. కాలంతో పోటీ పడుతూ పరుగులు పెట్టాలి.. ఇందుకు కాగితంపై అక్షర సేద్యం చేయాలి.. ఇలా నాలుగు దశాబ్దాలుగా అలుపెరగని ఓ 'రాజు' గారి కథపై ప్రత్యేక కథనం.

- 'పుత్తూరు కట్టు' కుటుంబంలో కథకుడు
- నాలుగు దశాబ్దాలుగా అలుపెరుగని రచయిత
- 560 కథలు, 15 కథల పుస్తకాలు, ఓ నవల ఆవిష్కరణ







గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టాక్ ది బుక్‌గా గాండ్ల మిట్ట కథలు

పుత్తూరు : పుత్తూరు మండలం రాచపాళెం గ్రామానికి చెందిన ఆర్‌సీ కృష్ణస్వామిరాజు సుమారు 40 ఏళ్లుగా తన రచనలతో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నారు. రాయలసీమ నేపథ్యం, పల్లె జీవితం, అనుబంధాలు, అలవాట్లు, సంప్రదాయాలు, సమకాలీన పరిస్థితులే ఆయన కథా వస్తువులు. వీటినే ఆధారంగా చేసుకుని ఇప్పటి వరకు సామాజిక కథలు, బాలల కథలు, ఆధ్యాత్మిక కథలు, హాస్య కథలు అంటూ మొత్తం 560 కథలు, 15 కథా సంపుటిలు, ఒక నవలను ఆయన రచించారు. బాల సాహిత్యం, హాస్యం, ఆధ్యాత్మికం, మాండలికాల విశిష్టతను చాటిన రాజుగారి కథలు ప్రచురితం కాని దినపత్రిక లేదు అంటే అతిశయోక్తి కాదు. ఆయన కథలు చదవడమంటే పాఠకుడికి పంచభక్ష్య పరమాన్నం అందించినట్లే.

ప్రస్థానం ఇలా..

కృష్ణస్వామిరాజు 1982లో తిరుపతి ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చేస్తున్న రోజుల్లో హోటల్‌కు వెళ్లి టిఫిన్ చేస్తుండగా ఓ వ్యక్తి ఎదురుగా వచ్చి కూర్చున్నాడు. టిఫిన్ చేసి నవ్వుతూ పలకరించి వెళ్లిపోయాడు. తర్వాత సర్వర్ వచ్చి కృష్ణస్వామికి ఇద్దరి బిల్లు ఇచ్చాడు. అతడెవరో తనకు తెలియదని కృష్ణస్వామి చెప్పినా సర్వర్ పట్టించుకోలేదు. ఇద్దరూ నవ్వుతూ మాట్లాడుకున్నారు కదా.. మీ మనిషే అనుకున్నా.. బిల్లు కట్టి ఇక్కడ నుంచి కదులు అని పట్టుబట్టాడు. దీంతో విధిలేక కృష్ణస్వామి బిల్లు కట్టి బయటపడ్డాడు. ఈ వింత అనుభవం మనసులో పదే పదే మెదులుతూ ఆయనకు కొత్త కథా వస్తువును అందించింది. ఇదే అనుభవాన్ని కాగితంపై పెట్టి ''బిల్లు కట్టాల్సిందే'' పేరిట తొలి కథతో ఆయన రచనా ప్రస్థానం మొదలైంది. తర్వాత 1984లో 'ఈ కాలం పిల్లలు' కథ తొలి సారిగా ఓ దినపత్రికలో ప్రచురితమైంది.

కట్టు కుటుంబం నుంచి..

రాచపాళెం (ఈశ్వరాపురం) ఈ పేరు చెప్పగానే వెంటనే గుర్తుకొచ్చేది పుత్తూరు కట్టు. జాతీయస్థాయిలో ఖ్యాతి గడించిన పుత్తూరు శల్య వైద్యుల కుటుంబానికి చెందిన రాచకొండ చెంగల్రాజు, నారాయణమ్మల ఎనిమిదో సంతానం కృష్ణస్వామిరాజు. ఆయన 1962 డిసెంబర్ 19వ తేదీన జన్మించారు. పోస్టుగ్రాడ్యుయేషన్, జర్నలిజంలో డిప్లొమా చేశారు. ఓ దినపత్రికలో రిపోర్టర్‌గా ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన సతీమణి మీనాక్షి సైతం హిందీ ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్నారు. పిల్లలు పూజిత, శేషసాయి ఇంజినీరింగ్‌లో పీజీ చేశారు. ప్రస్తుతం తిరుపతిలోనే కృష్ణస్వామిరాజు స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు.

పుస్తకాలు..పురస్కారాలు..

కృష్ణస్వామిరాజు రచనల్లో పుత్తూరు పిల్ల'గోడు', ముగ్గురాళ్ల మిట్ట, సల్లో సల్ల, గాండ్ల మిట్ట, రాజుగారి కథలు, రాణిగారి కథలు, కార్వేటినగరం కథలు, నాన్నారం కథలు, యోగక్షేమం వహామ్యహం, రాజనాల బండ, పకోడీ పొట్లం, దుక్కాలువా కప్పంగ, కిష్టడి కథలు. గతం గతః, మిక్చర్ పొట్లం, మేకల బండ (నవల) పేరుపొందాయి. ఈ క్రమంలోనే ఆయన పలు పురస్కారాలు అందుకున్నారు.

- ముగ్గురాళ్ల మిట్ట సంపుటికి శ్రీమక్కెన రామ సుబ్బయ్య స్మారక పురస్కారం.
- సల్లో సల్ల, కార్వేటినగరం కథల సంపుటికి శివే గారిదేవమ్మ స్మారక కథా పురస్కారం.
- పకోడి పొట్లం పుస్తకానికి రావూరి భరద్వాజ పురస్కారం
- గాండ్ల మిట్ట పుస్తకానికి సాహితీకిరణం పురస్కారం
- రాజు గారి కథలు బాలల పుస్తకం.. విజయనగరం జిల్లా పార్వతీపురం నారంశెట్టి బాల సాహిత్య పీఠం వారిచే ఉత్తమ గ్రంథంగా ఎంపికైంది.
- సాహితి సేవకు తిరుపతి విశ్వశ్రీ సాహితీ సమాఖ్య వారి గార్లపాటి పురస్కారం
- చక్కటి హాస్య రచనలు చేస్తున్నందుకు తెలుగు విశ్వవిద్యాలయం 2020లో కీర్తి పురస్కారం ప్రదానం చేసింది.
- 2023లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ''టాక్ ది బుక్'' కార్యక్రమంలో గాండ్ల మిట్ట, మేకల బండ పుస్తకాలపై ప్రత్యేక సమీక్ష కార్యక్రమాలు నిర్వహించింది.
- గాండ్ల మిట్ట పుస్తకంపై చెన్నై ప్రెసిడెన్సీ కాలేజీలో ఓ పరిశోధనా విద్యార్థిని ఎంఫిల్ పూర్తి చేసింది.


తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారంతో కృష్ణస్వామిరాజు (ఫైల్)

శిక్షణ ఇస్తున్నా



ఉప్పు, కారం, తీపి, చేదుల సమ్మిళితం నా బాల్యం. నా కథలకు ముడి సరుకు పూర్తిగా నా బాల్యం, నా గ్రామం, నా కుటుంబ నేపథ్యం. సామాజిక స్పృహతో, వాస్తవాలకు దగ్గరగా, అందరికీ అర్థమయ్యేలా సులభతర భాషలో మరిన్ని మంచి రచనలు చేయాలన్నదే నా లక్ష్యం. అలాగే అవకాశం దొరికినప్పుడల్లా పిల్లలకు కథలు రాయడం ఎలా? అనే అంశంపై తిరుపతిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నా.

– ఆర్‌సీ కృష్ణస్వామిరాజు

గంజాయి విక్రేతల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి క్రైమ్ : తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసినట్లు అలిపిరి డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. నిందితుల నుంచి 22 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు.. నగరంలోని కపిలతీర్థంరోడ్డులో ఉన్న ఓ హోటల్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి పట్టుబడింది. నిందితులు మేర్లపాకకు చెందిన కొండముని భరణి, చిత్తూరు జిల్లా సదుం మండలానికి చెందిన పట్టాభి గుణశేఖర్‌గా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అలిపిరి సీఐ రామకిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై విచారణ


వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కనమనంబేడు గ్రామంలో ఉన్న ఏకలవ్య మోడల్ ఎస్టీ గురుకులం నుంచి పదోతరగతి విద్యార్థి లోకేష్‌నాయక్ శనివారం ఉదయం అదృశ్యమైన ఘటనపై ఎంఈఓ రవీంద్రనాథ్ విచారణ చేపట్టారు. సోమవారం ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్‌తో మాట్లాడి వివరాలు సేకరించారు. విద్యార్థి ఎందుకు వెళ్లిపోయాడనే విషయంపై నివేదికను డీఈఓకు అందజేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు. విద్యార్థి లోకేష్‌నాయక్ హైదరాబాద్‌లోని లింగంపల్లెలో ఉన్నట్లు అతడు బంధువులకు ఫోన్ చేసి చెప్పాడని ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్ తెలిపారు.

నేడు బ్రహ్మోత్సవాలపై సమీక్ష

కాణిపాకం: చిత్తూరు జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వివిధ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ వాణి తెలిపారు. సమావేశానికి కలెక్టర్, ఎమ్మెల్యే హాజరుకానున్నారని, అధికారులు, ఉభయదారులు హాజరు కావాలని ఆమె కోరారు.

నోటు కొట్టు.. పోస్టు పట్టు!



సంపాదనే లక్ష్యంగా కూటమి నేతలు పరుగులు తీస్తున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ కాసులు వెనకేసుకుంటున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్నట్టు మూకుమ్మడిగా పేట్రేగిపోతున్నారు. అందులో భాగంగానే ప్రభుత్వోద్యోగుల బదిలీల్లో సైతం తమ హవా నడిపిస్తున్నారు. ప్రాధాన్యతా పోస్టుల కోసం పాకులాడే అధికారులను ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. కోరుకున్న చోటుకు ట్రాన్స్‌ఫర్ చేయించేందుకు రూ.కోట్లు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగులు సైతం కీలకమైన సీటు దక్కించుకునేందుకు ముఖ్య నేతలు అడిగినంత సొమ్ము చెల్లించుకుంటున్నారు. బదిలీల ప్రక్రియ తుది అంకానికి చేరిన నేపథ్యంలో మరింత ముమ్మరంగా పైరవీలు సాగిస్తున్నారు.

క్లైమాక్స్‌కు చేరిన ప్రభుత్వోద్యోగుల బదిలీలు

- ప్రాధాన్యతా స్థానాల కోసం పెరిగిన పైరవీలు
- తహసీల్దార్ సీటుకు రూ.2 కోట్ల వరకు రేటు కట్టిన కూటమి నేతలు
- తగ్గేదేలేదంటూ రూ.25లక్షల వరకు ఆఫర్ ఇస్తున్న వీఆర్‌ఓలు
- తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తిలో పోస్టింగ్ కోసం పోటాపోటీ
- ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియలో చక్రం తిప్పుతున్న డిప్యూటీ సీఎం పేషీ అధికారి బంధువు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీలు క్లైమాక్స్‌కు చేరాయి. వెబ్ ఆప్షన్స్‌కు కూడా నేటితో తెర పడనుంది. రెండు మూడు రోజుల్లో ఎవరెవరు ఎక్కడెక్కడికి బదిలీ అవుతున్నారో తేలిపోనుంది. ఈలోపు అధికారులు కోరుకున్న చోటుకు బదిలీ చేసుకునేందుకు కూటమి నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొందరు ఉద్యోగులు ఇప్పటికే మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు కూడా సమర్పించారు. మరి కొందరు కూటమి నేతలు అడిగినంత ఇచ్చి కోరిన చోటుకు బదిలీ చేయించుకునేందుకు పైరవీలు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులు తాము అడిగిన పనులు చేసిపెట్టే అధికారుల కోసం తాపత్రయపడుతున్న విషయం తెలిసిందే. అదే విధంగా అధికారులు కూడా కూటమి నేతల ప్రాపకం పొంది నచ్చిన చోటుకు బదిలీపై వెళ్లేందుకు తీవ్రస్థాయిలో యత్నిస్తున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతున్న బదిలీల్లో ఇప్పటికే పోలీసు, రెవెన్యూశాఖల్లో బదిలీలు ముగింపు దశకు చేరుకున్నాయి. అక్కడక్కడ కొందరు ఆర్డీఓ, తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓల బదిలీలు మిగిలి ఉన్నాయి. ఇంకా ఆర్‌అండ్‌బీ, జలవనరులశాఖ, సబ్ రిజిస్ట్రార్లు, ఆర్‌డబ్ల్యూఎస్, సివిల్ సప్లయ్, మైనింగ్ శాఖల్లోనూ పూర్తి స్థాయిలో బదిలీలు జరుగనున్నాయి. ఆయా శాఖల్లో అధికారులు ఎక్కువ మంది తిరుపతి జిల్లాకు రావడానికే మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండాలనుకునే వారు మాత్రం చిత్తూరు జిల్లాకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

ఉన్నతాధికారి బంధువుదే కీలకపాత్రం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వద్ద పనిచేసే ఓ అధికారి తండ్రి తిరుపతి రెవెన్యూశాఖలో పనిచేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు కొందరు ఆయన ఇంటికి క్యూకట్టారు. అన్ని శాఖల అధికారులు ఆ వ్యక్తిని ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆయన ఇప్పటికే కొందరిని సిఫారసు కూడా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇందు కోసం ఆయన స్థాయిలో మామూళ్లు పుచ్చుకుంటున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే ఆ అధికారి తిరుపతి అర్బన్ పరిధిలో విలువైన భూములను డబ్బులు తీసుకుని కూటమి నేతలకు ధారాదత్తం చేస్తున్నారు. అందులో తిరుపతి అర్బన్ పరిధిలోని రూ.కోట్లు విలువచేసే కొంకచెన్నాయిగుంట, అన్నా చెరువు ఆక్రమణలే కావడం గమనార్హం.

ఐదేళ్లు పూర్తి కాకపోయినా..

ఐదేళ్లు పూర్తయిన వారందరినీ బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే కూటమి నేతల ఒత్తిడితో రెండు, మూడేళ్లు పూర్తి కాని వారిని కూడా బదిలీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను పనిగట్టుకుని బదిలీ చేయించేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియమింపబడ్డారనే కారణంతో వీరిపై బదిలీ వేటు వేయిస్తున్నారు. ఇప్పటికే అధికారపార్టీ నేతల వేధింపులతో సచివాలయ ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గ్రామ, వార్డు స్థాయి కార్యకర్తలు సైతం సచివాలయ ఉద్యోగులను బదిలీపై వెళ్లిపోండంటూ హుకుం జారీ చేస్తుండడంతో ఆందోళనలో ఉన్నారు. మీరు వెళ్లిపోతే మా బంధువులను తెచ్చుకుంటామని పచ్చమూక బహిరంగంగానే చెబుతుండడంతో ఆవేదన చెందుతున్నారు. కూటమి నేతల బెదిరింపులను భరించలేక ఉద్యోగులు ఎక్కడకు బదిలీ చేసినా వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

మేమూ తగ్గం!

రెవెన్యూలో కీలకమైన వీఆర్‌ఓలు కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేసుకునేందుకు పోటీపడుతున్నారు. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు పరిధిలో వీఆర్‌ఓలు కొందరు విలువైన భూములు ఉన్న ప్రాంతాలకు బదిలీపై వెళ్లేందుకు అధికారపార్టీ నేతల ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నారు. మేము వస్తే.. ప్రభుత్వ భూములను మీరు కోరినట్టు చేసిపెడుతామంటూ కూటమి నేతలకు ప్రామిస్ కూడా చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఓ వీఆర్‌ఓ అయితే ఏకంగా రూ.25 లక్షలను కూటమి నేతలకు ముట్టజెప్పేందుకు సిద్ధమైనట్లు రెవెన్యూ శాఖలో ప్రచారం జరుగుతోంది.

తిరుపతికే తొలి ప్రాధాన్యం

అనంతపురం, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పనిచేసే రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, రిజిస్ట్రార్ శాఖల్లో పనిచేస్తున్న ముఖ్య అధికారులంతా తిరుపతి జిల్లాకు బదిలీ చేసుకోవడానికే ప్రాధాన్యమిస్తున్నారు. ముఖ్యంగా జలవనరుల శాఖలో పని చేసే నలుగురు చీఫ్ ఇంజినీర్లు అయితే కూటమి నేతలకు రూ.3 కోట్లు కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ శాఖలో దీర్ఘకాలంగా ఉన్న డీఈ స్థాయి అధికారులు సంపాదించుకునే అవకాశం ఉన్న ప్రాంతాలకు బదిలీపై వెళ్లేందుకు పైరవీలు చేస్తున్నారు. ఇకపోతే సబ్ రిజిస్ట్రార్లు కొందరు తిరుపతి, తిరుపతి రూరల్, రేణిగుంట, శ్రీకాళహస్తి, తొట్టంబేడు కోసం మంత్రి స్థాయిలో చెప్పించుకుంటున్నారు. అదే విధంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేసే సీనియర్ అసిస్టెంట్లు ఉద్యోగోన్నతి కోసం అమరావతికి ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎంత అడిగితే అంత ఇచ్చేందుకు కూడా వెనుకాడడం లేదని విశ్వసనీయంగా తెలిసింది. తిరుపతి డీపీఓ, గురుకుల పాఠశాల జిల్లా కో–ఆర్డినేటర్ పోస్టుల కోసం కొందరు పోటీపడుతున్నారు. శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, పుత్తూరు మున్సిపల్ కమిషనర్లు బదిలీలు కానున్నారు. వీటిలో గూడూరు, శ్రీకాళహస్తి, పుత్తూరు మున్సిపాలిటీలకు వెళ్లేందుకు పలువురు పోటీపడుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

AUTOMOBILES

VEHICLE FOR SALE

1) AP 39 X 0228- Ashok Leyland Tipper 12 Tyre (3118)-2019, 2) AP 39 UB 9019-Ashok Leyland Tipper 10 Tyre (2516)-2013, 3) AP 07 TN 2304-Ashok Leyland Goods Lorry 14 Tyre (3718)-2018, 4) AP 03 TB 3654-Ashok Leyland Goods Lorry -2011, 5) AP 21 U 7137, Ashok Leyland Goods Lorry -2000, Cont:T.J.Financial Consultancy & Investments Private Limited, No.9, K.R.Koil Street, 1st Floor, West Mambalam, Chennai -600033, Ph:044-24749252, 9701260666.

6) AP 07 TA 7646, TATA Goods Lorry 12 Tyre (3118)-2011, 7) AP 03 BQ 5448-Swaraj Tractor 843-2014, 8) AP 03 BL 2086-Swaraj Tractor 843-2015, 9) AP 02 AH 3928-Johndeer Tractor (5038)-2010, 10) AP 39TL 6388-Sonalika Tractor DI-42-2020.As It is Condition.Cont: T.J.Financial Consultancy & Investments Private Limited,No.9, K.R. Koil Street, 1st Floor, West Mambalam, Chennai -600033,Ph:044-24749252, 9701260666.

Education

DIRECT FINAL YEAR

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629

Services

వ్యవసాయ భూములకు, రైతులకు, ఉద్యోగస్థులకు, పర్సనల్, వ్యాపారస్థులకు మొదలగు వారికి సూచనలు మరియు సహాయం చేయబడును. వివరాలకు సం.ప్ర: 90632 90864.

INTERIOR DECORATOR

Kshetra Interiors, well-known in Hyderabad & Mumbai, is Expanding in AP with projects in Chirala, sullurpet and Naidupeta. We deliver modern interiors for Residential & commercial spaces. New project in Tirupati. Contact Cell : 9392654401 / 8125002806 or visit www.kshetrainteriors.com

Wanted

ప్రముఖ Govt.(R) Co.కి మండలాల వారిగా పనిచేయుటకు ఆఫీస్ అసిస్టెంట్స్, మేనేజర్స్ కావలెను. అ: 10th-డిగ్రీ/పీజీ, జీ:18,000-26,000, ట్రైనింగ్ ఇవ్వబడును. 8008830057.

ప్రకృతి గ్రూప్ ఆఫీస్ నందు పనిచేయుటకు చానల్ పార్టనర్స్, మార్కెటింగ్ అసోసియేట్స్ & ఏజెంట్స్ కావలెను. సంప్ర: రామానుజ సర్కిల్, SBI U/S 2nd ఫ్లోర్, తిరుపతి, 92466 64488.

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ / పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ, Sal: 20k-30k మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692.

Security F.O and A.S.Os Required Urgently in the Gudur Area. Who Ever Experienced Can Call Me. M.D.CASS. Ph: 99510 72170.

తిరుపతి హోమ్ కేర్ సర్వీసెస్, శ్రీమంతుల ఇళ్లలో పనిచేయుటకు పెద్దవారిని, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ 24/7 కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీ:15000-18000 ☎8125089175, 8121555042

గూడూరులోని ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీసులో పని చేయుటకు టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + కమిషన్ ఇవ్వబడును. సెల్ : 94410 40007.

ప్రైవేట్ మినీ బ్యాంకులలో పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. స్థలం: గ్రీంస్పెట్ (Greamspet) చిత్తూరు జిల్లా. సెల్: 9704013331.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశేషంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రీతా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.